ప్రజాశక్తి

శనివారం 13 జూలై 2024

I

అల్లూరి సీతారామరాజు



కొండచిలువ హల్‌చల్

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో లుంగపర్తి పంచాయతీ వెలగలపాడులో కొండచిలువ హల్ చల్ చేసింది, గ్రామనికి చెందిన బద్నుయిన సీతమ్మ కు చెందిన మేక గురువారం మేత కోసం గ్రామానికి సమీపాన అటవీ పొదలలోకి వెళ్లింది. మేకను కొండ చిలువ మింగేసింది. సాయంత్రానికి మేక జాడ కానరాక పోవడంతో పెంపకం దారులు గాలించారు. పొదల్లో ఉన్న కొండచిలువ మేకను మింగేసి నట్లు గుర్తించారు. కొండచిలువ సంచారంతో పలువురు పలువురు పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.



పొదల మాటున కొండ చిలువ

నిలిచిన జల్ జీవన్ మిషన్ పనులు

-నిరుపయోగంగా పైపులు -ఊటగెడ్డ నీరే ఆధారం -అవస్థలు పడుతున్న గిరిజనులు



మరమ్మతుకు గురైన సోలార్ పంపు ట్యాంకు

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు : మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న జర్రెల గ్రామపంచాయతీ పరిధిలో గల సెల్లుం పుట్టు గ్రామంలో పదేళ్ల క్రితం టిడిపి ప్రభుత్వం ఉన్నప్పుడు సోలార్ పంప్ ఇరిగేషన్ ద్వారా గ్రామంలో తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. సోలార్ ఇరిగేషన్ పంపు మరమ్మతుకు గురైన కారణంగా గత వైసిపి ప్రభుత్వ హయాంలో జల్ జీవన్ మిషన్ పథకం కింద గ్రామంలో సుమారు ఎనిమిది లక్షలు మంజూరు చేశారు. బోరు బావి తవ్వి, పైపులు పూడ్చకుండా ఇంటింటికి కుళాయిల వేయలేదని గ్రామస్తులైన కోడ లక్ష్మణ్, పాంగి సిద్దు, కోడా హరిబందు, కోడా జగ్గారావు, కూడా దళపతి గురువారం తెలిపారు. వారు ఇచ్చిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలో రింగు నుయ్యి ఉన్నప్పటికీ నీరు అడుగంటి పోవడంతో గ్రామానికి ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న ఊటగడ్డలో నీరు సేకరిస్తూ తాగునీటిని వినియోగిస్తున్నామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు గ్రామ సభల్లో అనేక దపాలుగా ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం స్పందించడం లేదన్నారు. కిలోమీటర్ దూరంలోనున్న ఊట గెడ్డ నుండి



ఊట గెడ్డలో నీటిని సేకరిస్తున్న మహిళలు



నిరుపయోగంగా ఉన్న జల్ జీవన్ పైపులు

మహిళలు నీళ్లు సేకరించి తలపై మోసుకొని తీసుకురావడం చాలా కష్టంగా ఉందన్నారు. ఈ మధ్యకాలంలో అకాల వర్షాలకు ఊటగెడ్డ బురద మయంగా మారిందని, ఈ నీటినే తాగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య పరిష్కారానికై ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. లేని పక్షంలో గ్రామ మహిళలలు ఖాళీ బిందెలతో ఎంపీడీవో కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపడతామని కోడా రుక్మిణి, కోడా జమ్మ, పాంగి రుక్న, పాంగి లలిత, కోడా ప్రభలు హెచ్చరించారు.

మలేరియా నివారణకు పటిష్ట చర్యలు

- ఇంటింటా దోమల మందు పిచికారీ - జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: మలేరియా వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు వేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రెండవ విడత దోమల మందు పిచికారీ పనులు నిర్వహించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పిచికారీ పనులు పూర్తి చేయాలని చెప్పారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు, సబ్‌కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మలేరియా విభాగం అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా ఫాల్సీఫారమ్ కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి యుద్ధ ప్రాతిపదికన పిచికారీ పనులు పూర్తి చేయాలని సూచించారు. జూలై, ఆగస్టు నెలలో అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఇంటిలోపల ఇంటి పరిసరాలలో దోమల మందు పిచికారీ పనులు చేయాలన్నారు. దోమల మందు పిచికారీ పనుల్లో ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు వి.ఓలు, స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలని తెలిపారు. 0-12 ఏళ్ల లోపు పిల్లలు తప్పని సరిగా దోమ తెరలు వినియోగించాలని చెప్పారు. ఎంపిడిఓలు, తహశీల్దారులు, ఇఓపిఆర్‌డీలు పిచికారీ పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామాలలో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఫ్రై డే డ్రై డే పక్కాగా అమలు చేయాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు పిచికారీ పనులు సక్రమంగా నిర్వహించే విధంగా బాధ్యత వహించాలని చెప్పారు.

గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో దోమల మందు పిచికారీ చేయాలని స్పష్టం చేసారు. గిరిజన విద్యార్థులు మలేరియా భారిన పడితే సంబంధిత వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు జ్వరం భారిన పడితే వెంటనే ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలలు అందించి, రక్తపరీక్షలు చేయించాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో గదుల కిటికీలకు ఐరన్ మెష్ వేయించాలని ఆదేశించారు. మలేరియా ప్రభావిత గ్రామాల్లో రాపిడ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు వైద్య ఆరోగ్య శాఖ, మలేరియా విభాగం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పూర్తి స్థాయిలో మందుల నిల్వలు ఉంచాలని ఆదేశించారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్లలో జరుగుతున్న దోమల మందు పిచికారీ పనులపై పిఓలను, ఎంపిడిఓలను, తహశీల్దారులను అడిగి తెలుసుకున్నాడు. ఈ టెలీ కాన్ఫరెన్సులో పిఓలు వి.అభిషేక్, సూరజ్ గనోరే, చైతన్య, జిల్లా వైద్యాధికారి జమాల్ బాషా, జిల్లా మలేరియా అధికారి ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డిఆర్‌డిఏ పిడి వి.మురళి, అధికారులు పాల్గొన్నారు.



బోరుబావి వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

పాఠశాల మంచినీటి బోరుకు మరమ్మతులు చేయాలని నిరసన

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని తుమ్మల పంచాయతీ పరిధి నారాయణపురం పాఠశాలలో ఉన్న తాగునీటి బోరుకు మరమ్మతులు చేయాలని కోరుతూ ఆ గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు శుక్రవారం బోరుబావి వద్ద నిరసన తెలిపారు. బోరింగ్ మరమ్మతులు చేసి విద్యార్థులకు దాహార్తిని తీర్చాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు సవలం పంతులు, సోడే రాజయ్య మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం, అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం విద్యార్థులు వ్యక్తిగత అవసరాలకు, గ్రామస్తులకు మంచినీటికి ఈ బోరును ఉపయోగిస్తున్నారని తెలిపారు. చేతిపంపు నెల రోజులుగా పాడైపోయి పని చేయకపోవడంతో విద్యార్థులు, స్థానికులు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఈ బోరుకు మరమ్మతులు చేయాలని తుమ్మల గ్రామ సచివాలయ అధికారులకు దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోయారు. తక్షణమే సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అలాగే పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని, దానికి మరమ్మతులు చేయించాలని కోరారు. అంగన్వాడీ భవన నిర్మాణం 2016కు పూర్వం చేపట్టి మధ్యలో వదిలేశారని, తక్షణమే ఆ భవన నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

పుట్ట గొడుగులు కూర తిని ఐదుగురికి అస్వస్థత

ప్రజాశక్తి -సీలేరు : పుట్టగొడుగులు కూర తిన్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు వ్యక్తులు అస్వస్థకు గురయ్యారు. జీకే వీధి మండలం సిరిబాల గ్రామానికి చెందిన అచ్యుత్ కాఫీ తోటలోకి కూలి పనులకు వెళ్లి సాయంత్రం వచ్చేటప్పుడు అడవిలో దొరికిన పుట్టగొడుగులు సేకరించారు. వాటిని కూర వండి కుటుంబ సభ్యులు తిన్నారు. తిన్న కొద్దిసేపటికి వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థకు గురయ్యారు. వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్య సేవలు అందించడంతో ప్రాణ హాని తప్పింది.



టిడిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- దేవీపట్నం

దేవీపట్నం మండలం ఇందుకూరుపేట పోలేరమ్మ గుడి సెంటర్లో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి భాస్కర్ శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యేగా గెలిచి మొదటి సారి గ్రామానిఇక విచ్చేసిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కావస్తుందని, ప్రతి సమస్యను నెమ్మదిగా పరిష్కారం చేసుకుంటూ అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా పోలవరం నిర్వాసితులకు తగిన సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మరిశెట్ల బుచ్చిబాబు, ప్రధాన కార్యదర్శి మట్టా మెహర్ బాబా గౌడ్, దేవీపట్నం సర్పంచ్ కుంజము రాజామణి, పలువురు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

మండలంలోని ఇందుకూరు పంచాయతీ పరిధిలోని పలు సమస్యలపై ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవికి కొండదొరల సంఘం జిల్లా నాయకులు యలగాడ నాగేశ్వరరావు ఆధ్వర్యాన శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇందుకూరు గ్రామంలో ఉన్న దేవుడు మాన్యం భూమికి పట్టా ఇప్పించాలని, కొత్త అంగన్వాడీ భవనం మంజూరు చేయాలని, దేవారం, ఇందుకూరు పంచాయతీల్లో ఆదివాసీ పేదలకు ఇచ్చిన 56 కొండపోడు పట్టాలకు రీ సర్వే చేసి భూములు అప్పగించాలని, ఇందుకూరులో తమ్మిశెట్టి వారి చెరువు వద్ద తూములు, కల్వర్టులు నిర్మించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, గ్రామంలో ఆటస్థలం కేటాయించాలని, గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీలు మంజూరు చేయాలని, తల్లిదండ్రులు లేని తెల్లం నక్షత్రకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దూసరి హరిబాబు, టెంకీ రాంబాబు, ఈరేటి యువ కిరణ్, ఈరేటి శివ, ఈరేటి వరలక్ష్మీ, జమ్ము కవిత, దూసరి ఉమా పార్వతి పాల్గొన్నారు.


వరదల సమయంలో అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-విఆర్.పురం

వరదల సమయంలో నిత్యావసరాలు అధిక ధరలకు విక్రయిస్తు కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను తహశీల్దారు సయ్యద్ మౌలానాఫాజిల్ హెచ్చరించారు. మండలంలోని రేఖపల్లిలో తహశీల్దారు కార్యాలయంలో చిరు వ్యాపారాలు, కిరాణా, జనరల్ స్టోర్, కూరగాయలు వ్యాపారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగనీయొద్దని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తమతో నేరుగా మాట్లాడవచ్చని చెప్పారు. ప్రజలపై భారం వేయొద్దని, కూరగాయలు, కిరాణా సరుకులు, పెట్రోలు, డీజీలు పాలు, చికెన్, మటన్ నిత్యావసరాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారుర సయ్యద్ మౌలానా ఫాజిల్



వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఉపాధ్యాయులను నియమించాలని ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో ఉన్న ఏకలవ్య స్కూల్‌లలో 4వేలకు పైగా విద్యార్థిని, విద్యార్థులు విద్య అభ్యశిస్తున్నారని, విద్యాబోధన కోసం స్థానిక ఉపాధ్యాయుల్ని నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ జీవన్ కృష్ణ శుక్రవారం ఐటిడిఏ లో ప్రాజెక్ట్ అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇతర రాష్ట్రాల ఉపాధ్యాయులని నియమించారన్నారు. వీరి భోదన ఇంగ్లీష్, హింది బాషలో ఉండటంతో విద్యార్థులకు అర్ధం కాలేదన్నారు. స్థానిక ఉపాధ్యాయులను నియమిస్తే విద్యార్థులకు అర్థం చేసుకునే అవకాశం ఉన్నదన్నారు. కొయ్యూరు, పాడేరు, అరకు, హుకుంపేటలో సొంత పాఠశాలల భవనాలు నిర్మాణ పనులు వేగం చేయాలన్నారు. యూనిఫామ్స్, బుక్స్ పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని కోరారు. అన్ని పాఠశాలల్లో తాగునీరు, రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాలన్నారు.మెనూ సక్రమంగా అమలు చేయాలని వినవించారు..

భవన నిర్మాణ పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి-పాడేరు : జిల్లా సమాఖ్య భవన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని ఐటిడిఏ పిఓ. వి.అభిషేక్ ఆదేశించారు. స్థానిక ఉప్పు కర్మాగారం సమీపంలో నిర్మిస్తున్న జిల్లా సమాఖ్య భవన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. భవన నిర్మాణాంలో నాణ్యత పాటించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు. సంఘాలకు బ్యాంకు లింకేజీ అందించాలని చెప్పారు. అనంతరం సమాఖ్య ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్‌డి.ఏ. పిడి. వి.మురళి, జిల్లా సమాఖ్య సభ్యులు, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడు మృతి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయతీ గుమ్మగుడ గ్రామానికి చెందిన పాంగి రాజ్ కుమార్ (30) గురువారం సాయంత్రం జ్వరంతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడు గత కొద్ది రోజుల నుంచి తలబరువు, నరాల సమస్య, జ్వరం వంటి లక్షణాలతో బాధ పడుతున్నాడు. ఇంట్లోనే ఉంటూ మాత్రలు వాడినప్పటికీ తగ్గక పోవడంతో గురువారం పరిస్థితి విషమించడంతో 108 అంబులెన్స్ లో ఆస్పత్రికి తరలించే సమయంలో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో వారి కుటుంబీకులు రోడ్డున పడ్డారు.



రోధిస్తున్న కుటుంబ సభ్యులు

ఇదిలా ఉండగా గ్రామంలో మరికొంతమంది జలుబు, జ్వరం వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. తక్షణమే గ్రామంలో వైద్య సిబ్బంది సందర్శించి మెడికల్ క్యాంపు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిబంధనలు మేరకు సమస్యల పరిష్కారం

ఉపాధ్యాయ సంఘాలతో ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో ఏజెన్సీలోని ఉపాధ్యాయుల సమస్యలపై వివిధ ఉపాధ్యాయ సంఘాలతో శుక్రవారం పిఒ గనోరే, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్ సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ ఉపాధ్యాయుల సంఘాల నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎంను నియమించాలని, జిఓ 1 ప్రకారం అర్హులైన వారికి ఏజెన్సీ డీఈవోగా ప్రమోషన్ కల్పించాలని, ఆశ్రమ పాఠశాలకు మూడు మండలాలకు ఒక ఎలక్ట్రీషియన్‌ను నియమించాలని, 77 మంది అన్‌ట్రైన్డ్ సెకండ్ గ్రేడ్ టీచర్లకు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, సిఎఫ్ఎంఎస్ సమస్యల వలన జీతాలు రాని వారి సమస్యను పరిష్కరించాలని, సబ్జెక్టు టీచర్ పోస్టులు ఖాళీ అయిన వెంటనే ప్రమోషన్లపై అర్హులైన వారిని నియమించాలని, డిఎల్ఎస్సిలో ఉన్న టీచర్ల సమస్యలను పరిష్కరించాలని, అర్హులైన వారికి జూనియర్ లెక్చరర్‌గా ప్రమోషన్లు కల్పించాలని, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని, ఉచిత డిఎస్‌సి కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అర్హులైన వారికి ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం ప్రమోషన్ కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులను పూర్తి చేయించాలని, ఆశ్రమ పాఠశాలల్లో బాలబాలికలు అస్వస్థకు గురైనప్పుడు రాజమండ్రి, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్తే అక్కడ పేరెంట్స్ కూడా భోజన సదుపాయం ఏర్పాటు చేయాలని, ఆశ్రమ పాఠశాలల్లో ఎప్పటికప్పుడు మొబైల్ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, రాజవొమ్మంగి మండలం తాళ్లపాలెం ఆశ్రమ పాఠశాలను ఆ గ్రామంలోనే కొనసాగించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

దీనికి స్పందించిన పిఒ విద్యార్థులను ఆసుపత్రికి తీసుకెళ్లినప్పుడు వారి పేరెంట్స్ భోజన సదుపాయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, ఉచితంగా డిఎస్‌సి కోచింగ్‌కు ప్రతిపాదన తయారు చేస్తామని, 77 మంది అన్ ట్రైన్డ్ టీచర్లకు నిబంధన ప్రకారం ఇంక్రిమెంట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిగిలిన వాటిలో తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, తమ పరిధిలో లేనివాటిని ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె.రంగారావు, బి.మంగిరెడ్డి, కత్తుల ఆదిరెడ్డి, ఎం.కరుణ విలాస్, కె.సూరిబాబు, బి.కృష్ణ, వై.విల్సన్, యల్.వేణుగోపాల్, జి.భూషణం, కె.రాంబాబు, కెఆర్‌పి.కుమార్, బి.ఆదిరెడ్డి, ఎటిడబ్ల్యుఒలు రామ తులసి, విజయశాంతి, ప్రసాద్, సూపరింటెండెంట్ బి.కిషోర్, సీనియర్ సహాయకులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, చక్రధర్ పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీల నిరసన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఎన్ఆర్ఇజిఎస్ కింద చేసిన పనులకు 6 వారాలుగా బకాయి పడ్డ కూలి డబ్బులను తక్షణమే చెల్లించాలని కోరుతూ మండలంలోని జడ్డంగి పంచాయితీ పరిధి చైతన్య నగర్‌లో ఆ గ్రామ ఉపాధి హామీ కూలీలు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘం నాయకులు తెడ్ల రాంబాబు మాట్లాడుతూ 40 మంది కూలీలు ఉపాధి హామీ కింద 6 వారాలకు పైగా చేసిన పనులకు సుమారు రూ3.60 లక్షలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఆ మొత్తం నేటికీ అధికారులు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ప్రతి సారీ కూలి డబ్బుల కోసం ప్రభుత్వా కార్యాలయాలు చుట్టూ తిరగాల్సి రావడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపాధి కూలీల సొమ్ములు జమ చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్డంగి గిరిజన మహిళా అధ్యక్షురాలు గూడెం లక్ష్మి, డబ్బకోట దుర్గ దేవి, తెడ్ల పార్వతి, పొడుగు లక్ష్మి, తెడ్ల కరుణ కుమారి, చీడి చిన్నలు, పూసం లక్ష్మి, డాకమురి సత్యవతి, పొడుగు మల్లిబాబు, పాతర సత్యనారాయణ, మొసరి మల్లీశ్వరి, పల్ల వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.



చైతన్య నగర్‌లో నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఎమ్మెల్యేకు కాంట్రాక్టు ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం :ఏజెన్సీలోని పాఠశాలలు, కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీషాదేవిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన పాఠశాలల టీజీటీ, పీజీటీ పోస్టులు కలిపి ఐటీడీఏ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేసిందని, ఇప్పటికే కాంట్రాక్టు పద్ధతిలో తాము పని చేస్తున్నందున డీఎస్సీ నోటిఫికేషన్ నుంచి ఆ పోస్టులను మినహాయించి తమకు ఉద్యోగ భద్రత కల్పించి, జీతాలు పెంచాలని కోరారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వై.యుగేందర్, మోహన్, శివశంకర్, లావరాజు, ప్రకాష్, అనంత కుమారి, రాధిక, సత్యనారాయణ, వెంకన్న దొర తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని 33 కెవి/11 కెవి సబ్ స్టేషన్ వద్ద మరమ్మత్తు పనులు చేపడుతుండటంతో ఈనెల 13న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఏవిఎన్ ఎమ్ అప్పారావు చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కించుమండ, గుంటసీమ, గుంటగన్నెల, కుమడ, సొగర, సొవ్వ, కొర్రాయి, ల్లాబూర్లు, గసభ, అరడ, కుద్రుమ, కొర్ర పంచాయతీల గ్రామాల గిరిజనులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రేపు ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో రంపచోడవరం మండలం, సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆవరణలో ఈ నెల 14న ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్వామీ పరిజ్ఞేయనంద మహారాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ వారిచే కంటి వైద్య శిబిరం కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందిస్తామని, కంటి ఆపరేషన్లు (కాటరాక్ట్) చేయిస్తామని తెలిపారు. కంటి ఆపరేషన్ నిమిత్తం వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు తీసుకొని రావాలని కోరారు. డాక్టర్ గోపాలం శివన్నారాయణ బృందం ఆధ్వర్యంలో ఫిట్స్ వైద్యశిబిరం నిర్వహించబడుతుందని, ఫిట్స్ రోగులకు నాలుగు నెలలకు సరిపడా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

గొల్లగూడెంలో పారిశుద్ధ్య పనులు


పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-వి.ఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి గొల్లగూడెం గ్రామంలో శుక్రవారం స్థానిక సర్పంచ్ పూనెం సరోజని దగ్గరుండి పారిశుద్ధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ వర్షాలు పడటంతో దోమల వృద్ధి ఎక్కువైందని, వాటి వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తగా శానిటేషన్ పనులు చేయించినట్లు చెప్పారు. వరదలు వచ్చే ముప్పుకు గురయ్యే గ్రామాల ప్రజలు ఈ ప్రాంతానికి పునరావాసానికి వస్తారని, వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, నాయకులు పంకు సత్తిబాబు, పంకు శ్రీరామ్మూర్తి, వార్డ్ మెంబర్లు కృష్ణవేణి, కట్టం, లక్ష్మి, సచివాలయం సెక్రటరీ శివప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు వ్యక్తిగత యూనిట్లు

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్


చెక్కులను అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: స్వయం సహాయ సంఘాల సభ్యులకు వ్యక్తిగత స్వయం ఉపాధి యూనిట్లను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో అరకు వ్యాలీ మండలానికి చెందిన 38 స్వయం సహాయ సంఘాలకు రూ.2కోట్ల 70 లక్షల 90 వేల బ్యాంకు లింకేజీ చెక్కును పంపిణీ చేసారు. ఈ సందర్భంగా స్వయం సహాయ సంఘాల సభ్యులతో మాట్లాడుతూ, ఈ నగదుతో ఏమి చేస్తారని అడగ్గా.. సభ్యులు కుట్టు మిషన్లు ఏర్పాటు చేసుకున్నామని, వారపు సంతలో చిరువ్యాపారాలు చేస్తుంటామని తెలిపారు. అంతకు ముందు ఐటిడిఏ సమావేశ మందిరం వద్ద ఏర్పాటు చేసిన చిరుధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావనా పశిష్ట, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, డి.ఆర్‌డిఏ పి.డి. వి.మురళి పాల్గొన్నారు.

'మీ కోసం' సమస్యలను పరిష్కరించాలి

పాడేరు: మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. ఐటిడిఏ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో 117 ఫిర్యాదులు అందాయి. జాయింట్ కలెక్టర్ భావనా పశిష్ట, ఐటిడిఏ, పి.ఓ.వి. అభిషేక్, డి.ఆర్‌ఓ బి. పద్మావతి సంయుక్తంగా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత వారం 310 ఫిర్యాదులు వచ్చాయని, 86 సమస్యలను పరిష్కరించారని చెప్పారు. మిగిలిన ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఫిర్యాదులు కొన్ని

పాడేరు మండలం సలుగు పంచాయతీ ఈదుల పాలెం గ్రామానికి చెందిన ఎం.కాసులమ్మ సర్వే నిర్వహించి అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. పెదబయలు మండలం గోమంగి పంచాయతీ కరుగొండ గ్రాస్తురాలు గడుతూరు సాములమ్మ వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసారు.జి.మాడుగుల మండలం కులపాడు గ్రామానికి చెందిన గసాడి సూర్య ప్రకాష్ జాతీయ రహదారి విస్తరణలో తన గృహం కోల్పోయానని నష్ట పరిహారం మంజూరు చేయాలని కోరారు. అనంతగిరి మండలం కొత్తూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎస్. సీతయ్య టెంకబుడ్డి, కరిగండ, బూసిపాడు, తంబలబంద గ్రామాల వరకు రహదారులు నిర్మించాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఎపిఓ ఎం. వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కొండలరావు, ఐటిడిఏ పరిపాలనాధికారి ఎం.హేమలత, ఎన్డీసి వి.వి.ఎస్. శర్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి . జమాల్ బాషా, ఐసిడి ఎస్ పిడి సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు సికిల్ సెల్ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి -సీలేరు : కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు సికిల్ సెల్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. జీకే వీధి మండలం రింతాడ జిటిడబ్ల్యూ బాలికల హాస్టల్‌లో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏడుగురు బాలికలకు మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా ఎవరికి మలేరియా సోకలేదు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఎవరికైనా జ్వరాలు వాంతులు విరోచనాలు తదితర వ్యాధులు సోకిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి సంప్రదించి వైద్య సేవలు పొందాలని కోరారు. జలుబు దగ్గు గజ్జి ఒళ్ళు నొప్పులు కళ్ళు కళకలు గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఈఓ సింహాచలం, ఎంఎల్‌హెచ్‌పి నిర్మల, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, సచివాలయం ఏఎన్ఎం కుమారి, పాఠశాల హెచ్ఎం పాపయ్యమ్మ, ఆస్క్ ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశాలు పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది, డాక్టర్ వినయ్‌కుమార్


జూనియర్ కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం పిచ్చి మొక్కలు తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలేజీ ఆవరణలో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగిపోవడంతో విష కీటకాలు క్లాస్ రూముల్లోకి చేరుతాయని విద్యార్థులు ఆందోళన గురయ్యారు. ఈ మేరకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ తుప్పలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శంకర్రావు అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ చుట్టూ తుప్పల తొలగింపు


తుప్పలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం రింతాడలోని బస్ షెల్టర్ చుట్టూ ఏపుగా పెరిగిన తుప్పలను పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ పర్యవేక్షణలో శుక్రవారం పారిశుధ్య సిబ్బంది తొలగించారు. ఈనెల 8న జరిగిన గ్రామ సభలో నిరుపయోగంగా ఉన్న బస్సు షెల్టర్‌ను వినియోగంలో తేవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పంచాయతీ సర్పంచ్ ఆదేశాల మేరకు బస్ షెల్టర్ చుట్టుపక్కల ఉన్న తుప్పలను యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. ఈ సందర్భంగా కార్యదర్శి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బస్ షెల్టర్ చుట్టుపక్కల ఉన్న తుప్పలు తొలగించామని, సెంట్రింగ్ ఆనుకొని ఉన్న టాయిలెట్స్‌లో ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి వాటర్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. బస్ షెల్టర్ ఆవరణలో జెసిబిలు, ఇతర వాహనాలు పార్కింగ్ చేయరాదని హెచ్చరించారు. వాహనదారులకు నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి సూర్యప్రకాష్, ఉపసర్పంచ్ సోమేశ్ కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం నిర్మాణానికి రూ.1.60 లక్షల విలువైన రేకుల వితరణ



రేకులు వితరణగా అందజేస్తున్న డాక్టర్ జమాల్‌ఖాన్

ప్రజాశక్తి-చింతూరు : దిక్కులేని అనాథలకు, వృద్ధులకు నిలువ నీడనిచ్చేందుకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమం నిర్మాణానికి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, జెకెసి ట్రస్టు చైర్మన్ ఎండి జమాల్ ఖాన్ రూ.1.60 లక్షల విలువైన ఇంటి పైకప్పు ఇనుప రేకులను సమకూర్చారు. వీటిని శుక్రవారం వృద్ధాశ్రమ నిర్వాహకురాలు ఎస్తేరు రాణి పెంటమ్మకు అందజేశారు. 2022 వరదల సమయంలో వృద్ధాశ్రమం నీట మునిగి పోవటంతో నాటి నుండి రత్నాపురం డిగ్రీ కాలేజీ నిర్మాణ దశలో ఉన్న భవనంలో వృద్ధులను, అనాథలను ఉంచి ఎస్తేరు రాణి వారికి సేవలు అందిస్తున్నారు. ఈ వృద్ధాశ్రమాన్ని ఇటీవల సందర్శించిన జమాల్ ఖాన్ కొత్తగా ఆశ్రమ నిర్మాణానికి అవసరమైన ఇనుము రేకులను అందించారు. దాతలు ముందుకొచ్చి మరి కొంత సాయం అందిస్తే త్వరితగతిన ఆశ్రమం నిర్మాణం పూర్తి అవుతుందని ఎస్తేరురాణి కోరారు. ఈ కార్యక్రమంలో జెకెసి ట్రస్ట్ సభ్యులు ఎస్కే షాజహాన్, ఇంతియాజ్, ఎస్కే రియాజ్. నటరాజ్, సయ్యద్ ఆసిఫ్, ఇలా చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ సోడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న క్రైమ్ డిసిపి వెంకటరత్నం

గంజాయి మత్తులో చోరీలు
పకడ్బందీ వ్యూహంతో ముఠాను అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గురువారం అర్ధరాత్రి గంజాయి సేవించి హైవేపై వెళ్తున్న వాహనంపై దాడి చేసి చోరీకి పాల్పడిన ముఠాను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. విశాఖ క్రైమ్ డిసిపి పి.వెంకటరత్నం శుక్రవారం సాయంత్రం ఎంవిపి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి ఎండాడ సమీపంలో గురువారం అర్ధరాత్రి ఒంటి గంటన్నర ప్రాంతంలో అటుగా వెళుతున్న లారీని ఆపి డ్రైవర్‌పై కొంతమంది దాడి చేశారు. అతని నుంచి రూ.10 వేల నగదు, మొబైల్ దొంగిలించారు. వారిని 24 గంటలు గడవకముందే పోలీసులు పకడ్బందీ వ్యూహంతో ఐదు బృందాలుగా గాలించి పట్టుకున్నారు. విచారణలో భాగంగా మరొక ఏడుగురిని పిఎం.పాలెం ప్రాంతంలోని ఆర్‌హెచ్ కాలనీలో అరెస్టు చేశారు. వీరంతా వ్యసనాలకు బానిసై, సరదాల కోసం దొంగతనాలు చేస్తున్నారని డిసిపి తెలిపారు. అరెస్టయిన వారిలో తోట నాగరాజు, తోట దుర్గా ప్రసాద్, బొత్స హరీష్, అరుగుల్ల భాను, మెరుగు నరసింహులతో పాటు మరో ముగ్గురు జువైనల్ నిందితులు ఉన్నారు. వారి నుంచి నాలుగు బైకులు, ఐదు వేల రూపాయల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశంలో క్రైమ్ ఎసిపి ఎ.వెంకట్రావు, ఈస్ట్ క్రైమ్ సిఐ ఎస్.ఆడమ్, అరిలోవ క్రైమ్ ఎస్ఐ హరి పాల్గొన్నారు.

నేడు ఎపిడబ్ల్యుజెఎఫ్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్‌ల విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశం శనివారం దొండపర్తి సింకా గ్రాండ్ హోటల్లో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు, నగర అధ్యక్షులు పి.నారాయణ తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం ఒక హోటల్‌లో ప్రస్తుత కార్యవర్గ సభ్యులుతో చర్చించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ శనివారం ఉదయం శ్రీకన్య థియేటర్ వద్దనున్న సింకా గ్రాండ్‌లో ఈ సమావేశం జరుగుతుందన్నారు. జర్నలిస్టుల పెండింగ్ సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించి సమావేశంలో తీర్మానం చేస్తామన్నారు. ఈ సర్వసభ్య సమావేశానికి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు.

బోధనాంశంగా మనుస్మృతి తగదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఢిల్లీ యూనివర్సిటీ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో మనుస్మృతిని బోధనాంశంగా ప్రవేశపెట్టేందుకు ఢిల్లీ యూనివర్సిటీలోని లా ఫ్యాకల్టీ చేస్తున్న ప్రయత్నాలను ఆపాలని భారత నాస్తిక సమాజం నాయకులు జె.రవి, టి.శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. లీగల్ మెథడ్‌గా పిలిచే కేటగిరీ కింద దీన్ని తీసుకురావడాన్ని ఆపాలన్నారు.

ఎయు మాజీ విసి అక్రమాలపై ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ విసి ప్రసాద్ రెడ్డి హయాంలో జరిగిన అక్రమాలను తవ్విన కొద్దీ మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయని యూనివర్సిటీ పరిరక్షణ సమితి సభ్యులు డాక్టర్ సురేష్ మీనన్, డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఉదయం ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ సమితి సభ్యులు తెలుగు విభాగం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధికార భాష సంఘం అధ్యక్షురాలు లక్ష్మీపార్వతిని తెలుగు విభాగం ప్రొఫెసర్‌గా నియమించడం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందన్నారు

అదానీ ఫైలు క్లియర్ !

డేటా సెంటర్‌కు ఐటి హిల్ నెంబర్ 4పై 130 ఎకరాలు
పలు విషయాలపై ఆరా తీసిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈ నెల 11న జరిపిన సుడిగాలి పర్యటనలో అదానీ డేటా సెంటర్ ఫైలుకు క్లియరెన్స్ లభించింది. తాజా పర్యటనలో అనేక అంశాలపై అధికారులను బాబు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనుల దశ, భూముల కేటాయింపు, అక్కడ ప్రస్తుతం ఏం జరుగుతుందన్న అంశాలపై దృష్టిసారించినట్లు కనిపిస్తోంది. జగన్ ప్రభుత్వంలో గౌతమ్ అదానీకి ఐటి హిల్ నెంబరు 4పైన 130 ఎకరాలను క్లౌడ్ కంప్యూటరింగ్, డేటా సెంటర్ కోసం కేటాయించిన సంగతి తెలిసిందే. ఎయిర్ పోర్టులో గురువారం సాయంత్రం అధికార యంత్రాంగంతో నిర్వహించిన సమీక్షలో అదానీ ఫైలు గురించి పరిశ్రమల శాఖ, ఎపిఐఐసి అధికారులను బాబు పలు వివరాలు అడిగారు. అన్నింటినీ క్షుణ్ణంగా ఆరా తీశారు. ఎండాడ లా కాలేజీ నుంచి దిగువ రోడ్డులోగల పనోరమ హిల్స్ ఎడమ వైపుగల 287 ఎకరాల ప్రభుత్వ కొండపై అదానీ డేటా సెంటర్ కోసం గతంలోనే 130 ఎకరాలు కేటాయించారు. దీనిపై సిఎం చంద్రబాబు స్పందిస్తూ 25 వేల మందికి ఉద్యోగాలు రాబోతున్నాయని, దీనికి సంబంధించిన క్లియరెన్స్‌లన్నీ చేయాల్సిన అవసరం ఉందని చెబుతూ పలు సూచనలు చేశారు.

కొత్త ఇండస్ట్రియల్ పాలసీ వస్తుందా ?

అధికార యంత్రాంగం, ముఖ్యంగా ఇండస్ట్రీస్, ఎపిఐఐసి అధికారులు కొత్త ఇండస్ట్రియల్ పాలసీ వస్తుందని ఎదురు చూస్తున్నారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల శాఖకు కొత్తగా డైరెక్టర్‌ను కూడా నియమించింది. మరో వారం రోజుల్లో న్యూ ఇండస్ట్రియల్ పాలసీ వస్తే గతంలో అదానీ సెంటర్ కోసం చేసిన భూ కేటాయింపులు వంటివి రద్దవుతాయని సంబంధిత అధికారులు భావించారు. కాగా స్వయంగా ముఖ్యమంత్రే ఆసక్తిగా అదానీ డేటా సెంటర్ ల్యాండ్ వివరాలు అడిగి అక్కడ ఖాళీ స్థలం ఇంకెంత ఉందన్న అంశాలపై చర్చించడంతో అదానీ ఫైలు క్లియర్ అయ్యిందన్న అంచనాకు వచ్చారు. గత ప్రభుత్వం సింగిల్ విండో పద్ధతిలో కొత్త పరిశ్రమలకు క్లియరెన్స్ ఇచ్చింది. 2019 ముందు చంద్రబాబు హయాంలోనూ ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో పరిశ్రమలకు క్లియరెన్స్‌లు ఇవ్వడం తెలిసిందే. పరిశ్రమలకు స్థలాల కేటాయింపులో ఈ ప్రభుత్వాల మధ్య పెద్ద తారతమ్యం ఏమీ కానరావడం లేదు. ఇదిలా ఉండగా విశాఖకు పెద్దగా పరిశ్రమలేవీ ఈ కాలంలో రాలేదని, అనకాపల్లి జిల్లాలో భూమి విస్తారంగా ఉన్నందున అటు తరలిపోతున్నాయని 'ప్రజాశక్తి'కి ఓ ఉన్నతాధికారి వెల్లడించారు.



అదానీ డేటా సెంటర్‌కు కేటాయించిన హిల్ నెంబర్ 4 (ఫైల్‌ఫొటో)

అభివృద్ధిపై బాబు మాటలు హాస్యాస్పదం

మాజీ మంత్రి అమర్‌నాథ్


మాట్లాడుతున్న అమర్‌నాథ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో చేసిన అభివృద్ధి పనులన్నింటినీ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను చేసినట్టుగా చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు వచ్చే ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడటం మానేసి జగన్మోహన్ రెడ్డిపై విష ప్రచారానికి దిగడం దారుణమన్నారు. ఇప్పటి వరకూ వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని తనదిగా చెప్పుకుంటూ రాష్ట్ర ప్రజలను ఆయన మభ్యపెడుతున్నారని విమర్శించారు. మోసపూరిత మార్కెటింగ్ స్కిల్స్ చంద్రబాబు సొంతమని ఎద్దేవా చేశారు. 2014 - 19 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కేవలం ఒక ప్రాంత అభివృద్ధికి మాత్రమే పనిచేసి ఇప్పుడు ఉత్తరాంధ్రపై సవతితల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులు ఇంత శరవేగంగా జరగడానికి జగన్మోహన్ రెడ్డినే కారణమన్నారు. ఎన్‌జిటిలో ఉన్న కేసులను కూడా అధిగమించి 35 శాతం పనులు చేశామన్నారు. మూలపేట పోర్టు, ఫిషింగ్ హార్బర్లు, మెడికల్ కాలేజీల నిర్మాణానికి అంకురార్పణ తమ హయాంలోనే జరిగిందన్నారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆంధ్ర యూనివర్సిటీలో తొలి క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసి విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తానని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేస్తూ నేటికీ ఆ దిశగా ఒక్క అడుగూ ముందుకు పడలేదని తెలిపారు. బిపిసిఎల్ కర్మాగారం రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు కొద్ది రోజులుగా చంద్రబాబు ప్రభుత్వం విపరీతమైన పబ్లిసిటీ ఇస్తోందని, ఆ కంపెనీ యాజమాన్యం మరికొన్ని రాష్ట్రాలలో కూడా అందుకోసం స్థలాలను పరిశీలిస్తోందని అమర్‌నాథ్ తెలిపారు. సూపర్ సిక్స్‌లో భాగంగా చంద్రబాబు పేర్కొన్న తల్లికి వందనం పథకంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇసుక ఉచితంగా ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించి రకరకాల ఛార్జీలు కలిపి టన్నుకు రూ.1400 వసూలు చేస్తోందని తెలిపారు. విద్యుత్ ఛార్జీల విషయంలో కూడా చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి వైసిపి కార్యకర్తలపై, వారి ఆస్తులపై దాడులకు పాల్పడుతున్నారని, ఒక పత్రిక కార్యాలయంపై ఇటీవల దాడి చేసి, మీడియాను కూడా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఇటువంటి చర్యలను మానుకోవాలని హితవు పలికారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

నాణ్యమైన ఆహారం అందించాలి

ప్రజాశక్తి - ములగాడ : పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ నిర్వాహకులను ఆదేశించారు. పౌష్టిక విలువలతో కూడిన భోజనం సమకూర్చాలని, నిర్ణీత సమయానికి అందజేయాలని సూచించారు. ఆయన శుక్రవారం మల్కాపురం ప్రకాష్ నగర్‌లో ఉన్న జివిఎంసి హైస్కూల్‌ను, త్రినాథపురంలోని పాఠశాలను సందర్శించారు. ప్రకాష్ నగర్‌లోని జివిఎంసి హైస్కూల్‌లో విద్యార్థులకు పెట్టిన మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బయట ప్రదేశంలో భోజనం పెట్టరాదన్నారు. డైనింగ్ హాల్‌లో భోజనం ఏర్పాటు చేయాలని లేదా క్లాస్ రూమ్‌లోనే భోజనం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు తెలిపారు. కాసేపు కుశల ప్రశ్నలు వేసి విద్యార్థులతో సందడిగా గడిపారు. బాగా చదువుకోవాలని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ, ఎస్ఎస్ఎ ఎపిసి శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిలో సహకరించండి
- సిఐఐని కోరిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రధాన కార్యదర్శి సౌరవ్ గౌర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నైపుణ్యాభివృద్ధిలో ప్రభుత్వానికి సహకరించాలని ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సౌరభ్ గౌర్ కోరారు. సిఐఐ ఆంధ్రప్రదేశ్ 'ఇండియన్ ఎకోసిస్టమ్ నీడ్స్ ఇండియన్ మేనేజ్‌మెంట్ ఎథోస్' అనే థీమ్‌తో సెకెండ్ ఎడిషన్ హెచ్‌ఆర్ సెమినార్‌ను శుక్రవారం ఉదయం విశాఖలోని నోవటల్ హోటల్‌లో నిర్వహించింది. దీనికి ఆయన వర్చువల్ విధానంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన నైపుణ్య గణన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని నైపుణ్యత కలిగిన వారిని గుర్తించి వారికి ఉద్యోగ కల్పనకు ప్రభుత్వం కృషి చేయనుందన్నారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సిఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కావాలంటే మరిన్ని పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పన అవసరమన్నారు. వ్యాపారాలు లాభాల బాటలో ఉంటేనే పెట్టుబడులు వచ్చే అవకాశముందన్నారు. పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన ఉద్యోగుల అవసరం ఎంతైనా ఉందన్నారు. పరిశ్రమలను, విద్యాసంస్థలను ఒక తాటిపైకి తీసుకువచ్చి ఏ విధంగా విద్యార్థులను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలో ఈ సదస్సు తెలియజేసిందన్నారు. అనంతరం నేషనల్ నెంబర్ 1 బెస్ట్ సెల్లింగ్ రచయిత, చాణక్య ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లీడర్‌షిప్ స్టడీస్ డైరెక్టర్ డాక్టర్ రాధాకృష్ణన్ పిళ్లై రచించిన 'కార్పొరేట్ చాణక్య' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐఐ సదరన్ రీజియన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.పద్మ కుమార్, ప్రముఖ వ్యూహకర్త కె.శ్రీనివాసరావు, కాంటర్ సంస్థ హెచ్‌ఆర్ డైరెక్టర్ అతుల్ నషీన్, ఆత్మన్ రామాయణ్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు శశిధర్ అంబటిపూడి, ఇన్వెస్కో లిమిటెడ్ హెచ్‌ఆర్ డైరెక్టర్ ప్రత్యూష శర్మ, ఐటిసి లిమిటెడ్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ శిల్పి సహాయ్ చౌదరి పాల్గొన్నారు.

విశాఖ వైద్యునికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ ఏడాది సెప్టెంబర్‌లో సెర్బియాలోని బెల్గ్రేడ్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఆర్థోపెడిక్ సర్జరీ, ట్రామాటాలజీ (ఎస్ఐసిఒటి) వరల్డ్ కాంగ్రెస్‌లో ప్రొఫెసర్, హెచ్‌ఒడి డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ సమర్పించిన నాలుగు శాస్త్రీయ పరిశోధన కథనాలు ఆమోదించబడ్డాయి. శుక్రవారం ఈ విషయాన్ని ఆయన మీడియాకు తెలిపారు.